

క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంజేపీ విద్యాసంస్థల ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్‌సీఓ మోతె రాజ్‌కుమార్ అన్నారు.

- 8లో ▸



చదువు కొనసాగించేందుకు అవకాశం

ఓపెన్ స్కూల్ చక్కని అవకాశం కల్పిస్తోందని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు అన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0^0 / 23.0^0

జిల్లాలో ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి మంచు కురిసే అవకాశం ఉంది.

రేపు డీఎంఓతో ఫోన్ ఇన్





భూపాలపల్లి రూరల్: రైతుల పంట ఉత్పత్తుల అమ్మకాలు, కొనుగోళ్ల ప్రారంభం కావడంతో జిల్లా మార్కెటింగ్ అధికారి (డీఎంఓ)తో 29వ తేదీ మంగళవారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు సాక్షి ఫోన్‌ఇన్ ప్రోగ్రాం నిర్వహిస్తోంది. జిల్లాలోని రైతులు వరి, పత్తి పంట ఉత్పత్తుల క్రయ విక్రయాల కోసం తమ సందేహాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ కింది నంబర్‌లో సంప్రదించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి కనక శేఖర్ తెలిపారు.

తేది : 29-10-2024, (మంగళవారం)

ఫోన్ చేయాల్సిన నంబర్ :
95508 54834

సమయం : ఉదయం 11.00గంటల నుంచి 12.00 గంటల వరకు

న్యూస్‌రీల్

108 వాహనం కేటాయించాలి



మొగుళ్లపల్లి: మండలానికి 108 వాహనం ప్రభుత్వం కేటాయించాలని సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడు చర్లపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలో 25 గ్రామాల్లో ప్రజలు ఆపద సమయంలో, రోడ్డు ప్రమాదాలు అనారోగ్య బారిన ప్రజలు ఆపద సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిట్యాల మండల కేంద్రంలో నుంచి 108 వాహనం వచ్చేసరికి సమయం సరిపోక అత్యవసర పరిస్థితిలో బాధితులు ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ వాహనాల్లో చిట్యాల సామాజిక వైద్యశాలకు చికిత్స కోసం వెళ్తున్నారన్నారు. సంబంధిత అధికారులు, కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి పాత మండలమైన మొగుళ్లపల్లికి నూతన 108 వాహనం కేటాయించాలని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



రేగొండ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని దమ్మన్నపేట క్రాస్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం.. మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దేశిని తిరుపతి, చెన్నాపూర్‌కు చెందిన అలగం రమేష్ మండలకేంద్రానికి వచ్చి తిరిగి రూపిరెడ్డిపల్లికి వెళ్తుండగా దమ్మన్నపేట క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న కారును ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం పరకాలకు తరలించారు. దేశిని తిరుపతి కాలుకు తీవ్రగాయమవడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



ఏటూరునాగారం: నవంబర్ 3నుంచి 5వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్ బాలికల క్రీడాపోటీలకు ఏటూరునాగారం స్పోర్ట్స్ క్లబ్‌కు చెందిన ముగ్గురు బాలికలు ఎంపికైనట్లు కోచ్ పర్వతాల కుమారస్వామి తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రీడాపోటీలు ఆదివారం హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో సబ్ జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికలో స్పోర్ట్స్ క్లబ్‌కు చెందిన రాధిక, హరిప్రియ, మనవితలు సబ్ జూనియర్ విభాగంలో ఎంపికయ్యారని తెలిపారు. ఈ ముగ్గురు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొంటారని వివరించారు. వీరిని స్పోర్ట్స్ క్లబ్ కోచ్ కుమారస్వామితో పాటు పలువురు అభినందించారు.

గుట్కా నిషేధం అయోమయం

బ్యాన్ చేస్తూ మే నెలలో సర్కారు ఉత్తర్వులు

- ఆగని తయారీ, విక్రయాలు
- తెలివిగా వ్యవహరిస్తున్న తయారీదారులు
- సున్నం కలిపిన వక్కలు, పొగాకు వేర్వేరుగా ప్యాకింగ్
- రెండు కలిపితేనే గుట్కాగా మార్పు
- వీగిపోతున్న పోలీసుల కేసులు



భూపాలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించినా గుట్కా, పాన్ మసాలాల తయారీ, విక్రయాలు ఆగడం లేదు. ప్రభుత్వ ఆదేశాల్లోని కొన్ని లొసుగులను గ్రహించిన వ్యాపారులు పట్టుబడకుండా తెలివిగా వ్యవహరిస్తున్నారు. నిషేధిత గుట్కాను నేరుగా తయారు చేయకుండా రెండు ప్యాకెట్లలో వేర్వేరుగా ప్యాక్‌చేసి చట్టానికి పట్టుబడకుండా జోరుగా విక్రయిస్తున్నారు. ఫలితంగా పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు పట్టుకున్నా కేసులు వీగిపోతున్నాయి.

ఏడాది పాటు నిషేధించిన ప్రభుత్వం..

ఆహార భద్రత, ప్రమాణాల చట్టం ప్రకారం ప్రజల ఆరోగ్యం దృష్ట్యా గుట్కా, పాన్ మసాలాల తయారీ, నిల్వ, సరఫరా, విక్రయాలను నిలిపివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారు. 2024 మే 24వ తేదీ నుంచి ఏడాది పాటు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ విభాగం రాష్ట్ర అధికారులు గుట్కా బ్యాన్‌పై ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయకపోవడంతో గుట్కా దందా జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మూడు పూలు ఆరు కాయలు అన్న చందంగా జోరుగా సాగుతోంది.

వీగిపోతున్న కేసులు..

ఇటీవల జిల్లాలోని పోలీసుశాఖకు చెందిన సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ టీం అధికారులు రూ.7లక్షల విలువైన విమల్, పాన్ బహార్, అంబార్ తదితర ప్యాకెట్లను పట్టుకొని కేసులు నమోదు చేశారు. వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో సైతం కేసులు నమోదయ్యాయి. వెంటనే సదరు వ్యాపారులు కోర్టును ఆశ్రయించి రిలీజింగ్ ఆర్డర్ తీసుకొని రావడంతో పోలీసులు చేసేది లేక వాహనాలు, ఉత్పత్తులను వదిలేశారు. కేసులను సైతం కొట్టేయాల్సిన పరిస్థితి నెలకొంది. సున్నం కలిపిన బాగం వక్కలు, పొగాకును కలిపితే గుట్కా తయారు అవుతున్నప్పటికీ, ఆ రెండు వేర్వేరుగా ప్యాక్ చేసి ఉండటంతో ప్రభుత్వం విధించిన నిషేధం అమల్లోకి రావడం లేదు. ఫలితంగా న్యాయస్థానంలో వ్యాపారులకు ఉపశమనం లభిస్తుంది. ప్రభుత్వం మరోమారు దృష్టి సారించి అనేక రకాల వ్యాధులకు కారణమవుతున్న గుట్కాను పూర్తిస్థాయిలో నిషేధించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేర్వేరుగా తయారీ..

రాష్ట్ర ప్రభుత్వం పొగాకు, నికోటిన్ కలిగిన గుట్కా, పాన్ మసాలాల తయారీ, నిల్వ, రవాణా, సరఫరా చేయడం, విక్రయించడంపై నిషేధం విధించింది. పొగాకు ఉత్పత్తులను మాత్రం బ్యాన్ చేయలేదు. దీంతో చట్టానికి పట్టుబడకుండా ఉండేందుకు వ్యాపారులు కొత్త దందాకు తెరలేపారు. గుట్కాను నేరుగా తయారు చేయకుండా సున్నం కలిపిన బాగం వక్కల ప్యాకెట్, పొగాకు ప్యాకెట్‌లను వేర్వేరుగా తయారు చేస్తున్నారు. ఈ రెండింటిని కలిపితేనే గుట్కా తయారు అవుతుంది. ఇలా వేర్వేరుగా తయారు చేసిన ప్యాకెట్లను బహిరంగంగా, విచ్చలవిడిగా విక్రయిస్తూ తయారీదారులు, హోల్‌సేల్ వ్యాపారులు కోట్లు గడిస్తున్నారు.

పొగాకు ఉత్పత్తులపై నిషేధం లేదు..

పొగాకు ఉత్పత్తులపై నిషేధం లేదు. గుట్కాల తయారీ, విక్రయంపై మాత్రమే నిషేధం ఉంది. నిబంధనలకు విరుద్ధంగా గుట్కా రవాణా, విక్రయాలు జరిగితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

- రోహిత్‌రెడ్డి, జిల్లా ఆహార భద్రత అధికారి

కాలిపోతున్న షాపింగ్‌మాల్



మంటల్లో షాపింగ్ మాల్స్..

- జనగామలో ఘోర అగ్నిప్రమాదం
- కళ్లముందే కాలిబూడిదైన దుకాణాలు
- ఆస్తి నష్టం రూ.20కోట్లుగా అంచనా
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌గా నిర్ధారణ
- దుఃఖసాగరంలో వ్యాపార కుటుంబాలు
- సెన్సార్ పెట్టర్లతో ఆలస్యమైన సహాయక చర్యలు
- సమాచారం అందించిన గంటల తర్వాత అప్రమత్తమైన అగ్నిమాపక శాఖ

జనగామలో ఆదివారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదం మూడు వ్యాపార కుటుంబాలకు కోట్లలో నష్టాన్ని మిగుల్చగా.. 20 చిన్నా చితకా దుకాణాదారులను రోడ్డున పడేసింది. ఉదయం ఆరు గంటల సమయంలో షాపింగ్ కాంప్లెక్స్ లోపల నుంచి ఎగిసి పడిన మంటలు రెండు, మూడు గంటల్లోనే విస్తరించాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించినా.. అగ్నిమాపక శాఖ నిర్లక్ష్యంతో ఊహించని విధంగా నష్టం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు షాపింగ్ మాల్స్, ఒక రెడీమేడ్ వస్త్ర దుకాణం మంటలకు ఆహుతైంది. అన్నీ కలుపుకుని రూ.20 కోట్ల మేర నష్టం జరిగి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. - జనగామ

- వివరాలు 8లో ▸

చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా నరేందర్



చిట్యాల: చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా మండలకేంద్రానికి చెందిన కట్కూరి నరేందర్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత ఐక్యవేదికను విస్తరించాలనే లక్ష్యంతో జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో పద్మశాలి జాతి చైతన్యం కోసం చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేసేందుకు యువ నాయకుడైన నరేందర్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతీ ఇల్లు సర్వే చేయాలి

కలెక్టర్ రాహుల్ శర్మ



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: త్వరలో చేపట్టనున్న ఆర్థిక సర్వేలో ప్రతీ ఇల్లు సర్వే చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సామాజిక ఆర్థిక సర్వే ప్రక్రియపై రెవెన్యూ, పంచాయతీరాజ్, సంక్షేమ, ప్రణాళిక, డీఆర్‌డీఓ, మున్సిపల్ శాఖ అధికారులతో ఆదివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే ప్రక్రియ నిర్వహణకు 933 ఎన్యూమరేటర్లు అవసరం ఉందని తెలిపారు. 10మంది ఎన్యూమరేటర్లకు మండల స్థాయి అధికారిని పర్యవేక్షణ అధికారిగా నియమించనున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది, డీఆర్‌డీఏ సిబ్బందిని ఎన్యూమరేటర్లుగా నియమించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో ట్రైనర్లు పాల్గొని తదుపరి మండలస్థాయిలో సర్వే టీములకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సర్వే ప్రక్రియ పర్యవేక్షణ చేయాలని స్పష్టంచేశారు. సోమవారం ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు నియామకపు ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతీ రోజు సర్వే వివరాలను డేటా ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. తప్పులకు తావులేకుండా డేటా ఎంట్రీ చేసేందుకు సిబ్బందిని నియమించి శిక్షణ ఇవ్వాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో సిబ్బందిని ఎంపిక చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సీపీఓ నారాయణరావు, డీఆర్‌డీఓ అవినాష్, సీపీఓ బాబురావు, సంక్షేమ అధికారి చిన్నయ్య, ఆర్డీఓ మంగీలాల్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి రూరల్: మంజూర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు 99మంది లబ్ధిదారులకు రూ.25.68 లక్షలు విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యచికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుందన్నారు. బాధితులు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఓసీ–3 ప్రైవేట్ కాంట్రాక్టు కార్మికులు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. సింగరేణి ప్రైవేట్ కార్మికులకు దసరా బోనస్ రూ.5000 ఇచ్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, పీసీసీ సభ్యులు చల్లూరి మధు, నాయకులు పిప్పాల రాజేందర్, బుర్ర కొమురయ్య, ఆకుల మహేందర్, దేవన్, సుంకరి రామచంద్రయ్య, ఓసీ కార్మికులు పుప్పాల దీపక్ ,బాలకృష్ణ, లక్ష్మీనారాయణ, సురేందర్ ఉపేందర్, శివ, సంపత్, సతీష్, చందర్, రమేష్, రాజు అంబటి, రాజు, అంజయ్య, రవీందర్, కార్మికులు పాల్గొన్నారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి



మొదటి బహుమతి గెలుచుకున్న మురళి లెవన్ జట్టుకు కప్ అందజేస్తున్న సూర్య

ఏటూరునాగారం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మంత్రి సీతక్క తనయుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సూర్య అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ క్రీడా మైదానంలో హోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్, క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ ఆదివారం జరిగాయి. ఈ ఫైనల్స్‌లో మురళి లెవన్, షారు లెవన్ జట్లు తలపడ్డాయి. షారులెవన్ జట్టు 15 ఓవర్లకు ఎనిమిది వికెట్ల నష్టానికి 89 పరుగులు చేయగా మురళి లెవన్ జట్టు 13వ ఓవర్ మూడు బాళ్లకు 90 పరుగులు చేసి ఒక వికెట్ కోల్పోయి విజయం సాధించింది. ఈ మేరకు ఫైనల్స్‌లో గెలుపొందిన మురళి లెవన్ జట్టుకు సూర్య కప్‌తో పాటు రూ.30వేలు మొదటి బహుమతి, రెండో బహుమతి షారు లెవన్ జట్టుకు రూ.15వేల నగదు, కప్‌ను సూర్య అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు.

భక్తుల సందడి

- మేడారం, హేమాచల క్షేత్రానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- పుణ్యస్నానాలు ఆచరించి పూజలు



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



భక్తులను శఠారితో దీవిస్తున్న అర్చకుడు



స్వయంభు లక్ష్మీనర్సింహస్వామి

ఎస్‌ఎస్‌తాడ్వాయి/మంగపేట: మేడారం, హేమాచల క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మేడారంలోని సమ్మక్క– సారలమ్మలను దర్శించుకునేందుకు రాష్ట్రంతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీర సారె, కానుకలు, ఒడిబియ్యం, ఎత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించారు. సుమారుగా 10వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు దేవాదాయశాఖ అధికారులు అంచనా వేశారు. అనంతరం భక్తులు చెట్ల కింద వంటా వార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు ఆరగించారు. మేడారానికి వచ్చిన భక్తులు మేడారంలోని ఆది వాసీ మ్యూజియాన్ని సందర్శించి ఆదివాసీల చిత్రాలను, పురాతన వస్తువులను వీక్షించారు. మ్యూ జియం అసిస్టెంట్ క్యూరేటర్ రవికుమార్ భక్తులకు సమ్మక్క– సారలమ్మ జీవిత చరిత్ర, ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయలను వివరించారు.


హేమాచల క్షేత్రంలో..

మంగపేట మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో స్వయంభుగా వెలిసిన స్వామివారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వందలాదిగా భక్తులు కార్లు, ఆటోలు, ప్రైవేట్ బస్సులు, డీసీఎం తదితర వాహనాల్లో ఉదయాన్నే గుట్టపైకి చేరుకున్నారు. భక్తులు ఆలయ సమీపంలోని పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం హేమాచల కొండపై ఉన్న ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు కారంపుడి పవన్‌కుమార్, ఈశ్వర రామానుజదాస్ స్వామివారికి ఉదయం 10నుంచి 12 గంటల వరకు నువ్వుల నూనెతో తిలతైలాభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిపించి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని మానవ శరీరంతో పోలి ఉండే స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని భక్తులు పులకించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ పూజారులు ప్రత్యేక అర్చనలు జరిపించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. సంతానం కోసం వచ్చిన దంపతులకు స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని అందజేశారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆలయ ప్రాంగణం, దైత అమ్మవారి పరిసర ప్రాంతాలతో పాటు పార్కింగ్ స్థలాలు జనసందడితో కనిపించాయి.

200 సభ్యత్వాలు చేయించాలి

గోవిందరావుపేట: ప్రతీ పోలింగ్ బూత్‌లో 200 సభ్యత్వాలు చేయించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం బీజేపీ జిల్లా పదాధికారుల సమావేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒక పోలింగ్ బూత్‌లో 200 సభ్యత్వాలు తప్పకుండా చేయించాలన్నారు. సాధారణ సభ్యత్వాలు చేయటానికి ఈ నెల 31వ తేదీ వరకు సమయం ఉందన్నారు. ఈ సమయాన్ని కార్యకర్తలు, నాయకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రియాశీల సభ్యత్వాలను ప్రతీ మండలంలో పూర్తి చేయాలన్నారు. తద్వారా మండల కమిటీల ఎన్నికకు అన్ని మండలాలు అర్హత సాధించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ కేవీఎల్ఎన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీరా క్రిష్ణవేణి, చింతలపూడి భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్రచారి, నరేష్, అసెంబ్లీ కన్వీనర్ జాడి వెంకట్, క్రియాశీల సభ్యత్వ పరిశీలకులు ప్రభాకర్, జవహర్ లాల్, రామారాజు, రవీందర్ రెడ్డి, కృష్ణాకర్, సుధాకర్ రెడ్డి, జ్యోతి, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కరకట్ట నిర్మిస్తేనే ఇసుక తవ్వకాలు జరపాలి



తవ్వకాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు



జంపన్నవాగులో చేస్తున్న రోడ్డు పనులు

- ఇసుక క్వారీ ఏర్పాటుకు జంపన్నవాగులో రోడ్డు పనులు
- అడ్డుకున్న కొండాయి గ్రామస్తులు

ఏటూరునాగారం: కొండాయి గ్రామానికి ఆనుకొని ప్రవహించే జంపన్నవాగుకు కరకట్ట నిర్మాణం పూర్తి చేసిన తర్వాతనే ఇసుక తవ్వకాలు చేపట్టాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పరికి ప్రసాద్, గ్రామస్తులు తెలిపారు. కొండాయి గ్రామానికి సమీపాన జంపన్నవాగులో ఇసుక క్వారీ ఏర్పాటు చేయడానికి ఓ కాంట్రాక్టర్ జంపన్నవాగుపై ఆదివారం రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాడు. ఇది గమనించిన గ్రామస్తులు క్వారీ పనులను నిలిపివేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. గ్రామస్తుల కోసం వాగుపై రోడ్డు నిర్మాణం చేపడితే సంతోషిస్తామని తెలిపారు. కాని కరకట్ట నిర్మించకుండా ఇసుక తవ్వకాలు చేపడితే గ్రామస్తుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. గతంలో కూడా ఇదే తరహాలో కొండాయి బ్రిడ్జికి సమీపంలో ఇసుక క్వారీ తవ్వకాలు జరిపి బ్రిడ్జి పైనుంచి రవాణా కొనసాగించారని తెలిపారు. దీంతో బ్రిడ్జి కుంగిపోయి ప్రమాదకరంగా మారి 2023లో వచ్చిన భారీ వరదలకు బ్రిడ్జి నామరూపాలు లేకుండా కొట్టుకుపోయి 8మంది జలసమాధి అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామానికి హాని తలపెట్టే ఏ పనులను కూడా అనుమతులు ఇవ్వొద్దని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భిక్షపతి, దబ్బగట్ల బాబు, రాజారం, కోటేష్, సాగర్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులు పొలం బాట పట్టాలి

● టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి


మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

కాజీపేట అర్బన్ : విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించేందుకు విద్యుత్ అధికారులు పొలం బాట పట్టాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల వినియోగదారులకు విద్యుత్ ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని, అలసత్వం వహించే అధికారులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా అలసత్వం వహించి రైతుల మృతికి బాధ్యులైన జూనియర్ లైన్‌మెన్, ఎస్‌ఈలను ఇటీవల సస్పెండ్‌చేసినట్లు తెలిపారు. విద్యుత్ ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ 18004250028 లేదా 1912ను వినియోగించుకోవాలని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


అంజలి (ఫైల్)

ఎల్కతుర్తి: ఉరేసుకుని ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఆదివారం ఎల్కతుర్తి మండలం జీల్గుల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సుధాటి అంజలి(30), రాజగోపాల్ దంపతులు. ఈ క్రమంలో రాజగోపాల్ వ్యవసాయ పనులకు, తన మూడు సంవత్సరాల కూతురు నానమ్మ వద్దకు వెళ్లింది. సాయంత్రం సమయంలో అంజలి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై సమాచారం అందుకున్న సీఐ పులి రమేశ్, ముల్కనూరు ఎస్సై సాయిబాబు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా, అంజలి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

నర్మెటలో వ్యక్తి..


ఉప్పలయ్య(ఫైల్)

నర్మెట : అతిగా మద్యం సేవిస్తున్నావని కుటుంబీకులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం నర్మెటలో జరిగింది. ఎస్సై నైనాల నగేశ్, గ్రామస్తుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ప్రజ్ఞాపురం ఉప్పలయ్య (55) కొంతకాలంగా అతి గా మద్యం సేవిస్తున్నాడు. దీంతో మద్యం మానేయాలని కుటుంబీకులు మందలించారు. దీనిపై మనస్తాపం చెందిన ఉప్పలయ్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేశ్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు..

● దంపతులకు తీవ్ర గాయాలు
● గణపురం మండల కేంద్రంలో ఘటన



గణపురం : మండలకేంద్రంలో ఆదివారం రాత్రి కారు బీభత్సం సృష్టించింది. మండలకేంద్రానికి చెందిన చిలుమోజు భరత్, లాస్య దంపతులు ద్విచక్రవాహనంపై వస్తుండగా కారు అతివేగంతో ఢీకొంది. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. చిట్యాల మండలం చల్లగరిగెకు చెందిన బండి సంజయ్ గణపురం మండలకేంద్రంలో ఓ ఫంక్షన్‌కు హాజరై తిరిగి వెళ్తున్న క్రమంలో అతడి కారు యూనియన్ బ్యాంకు సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో భరత్,లాస్య దంపతుల తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో భూపాలపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. లాస్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా, ఢీకొన్న అనంతరం కారు సుమారు కిలో మీటర్ మేర ద్విచక్రవాహనాన్ని నెట్టుకెళ్లి బోల్తా పడింది.

వస్త్రాలను తరలిస్తున్న ఇతర వ్యాపారులు


దుకాణాలను ఖాళీ చేస్తున్న వ్యాపారులు


కన్నీటి పర్యంతమవుతున్న శ్రీలక్ష్మి యజమాని కైలాసం


రోదిస్తున్న షాపింగ్ మాల్‌లోని దుకాణాల బాధితులు


విలపిస్తున్న ఎస్‌ఆర్ బ్రదర్స్ యజమాని శ్రీనివాస్


మంటల్లో షాపింగ్ మాల్స్ ..

కాలిబూడిదైన ఫర్నిచర్, సామగ్రి, రెడీమేడ్ వస్త్రాలు

● రూ.20కోట్ల మేర ఆస్తి నష్టంగా అంచనా
● ఆరు ఫైరింజన్లతో శ్రమించిన సిబ్బంది
● పక్కనే ఉన్న దుకాణాలకు తప్పిన ముప్పు


షాపింగ్ మాల్స్ నుంచి ఎగిసి పడుతున్న మంటలు, ఆకాశాన్ని కప్పేసే విధంగా పొగలు

జనగామ: జనగామ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో రూ.కోట్లలో ఆస్తి నష్టం వాటిల్లింది. పలు వ్యాపార కుటుంబాలు రోడ్డున పడ్డాయి. పట్టణంలోని విజయ షాపింగ్ మాల్‌ను శనివారం అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో మూసి వేసి యజమాని, కార్మికులు ఇళ్లకు వెళ్లిపోయారు. ఉదయం విజయ షాపింగ్‌మాల్ నుంచి పొగలు రావడాన్ని రోడ్డువెంట వెళ్లే వాకర్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు చేరుకుని అగ్నిమాక శాఖకు కబురందించారు. సంఘటనా స్థలానికి కూతవేటు దూరంలో ఉన్నా ఫైర్ ఇంజన్ రావడానికి ఆలస్యం కావడంతో షాపింగ్ మాల్ లోపల మంటలు వ్యాపించి గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు రెండు అంతస్తుల వరకు ఎగిసి పడ్డాయి. ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టిన విద్యుత్ అధికారులు కరెంటు సరఫరా నిలిపివేశారు. షాపింగ్ మాల్ షెట్టర్ తీయడానికి ప్రయత్నించగా సెన్సార్‌తో పనిచేసేవి కావడంతో కరెంటు లేక తెరుచుకోలేదు. దీంతో జేసీబీ సహాయంతో షెట్టర్‌ను బద్దలు కొట్టి సహాయక చర్యలు కొనసాగించారు. అప్పటి వరకు విజయ షాపింగ్ మాల్ వరకే పరిమితమైన మంటలు పక్కనే ఉన్న ఎస్‌ఆర్ బ్రదర్ రెడీమేడ్ వస్త్ర దుకాణాన్ని చుట్టుముట్టాయి. అందులోని సరుకును బయటకు తీసేలోపే క్షణాల్లో రూ.70లక్షల విలువ చేసే వస్త్రాలు కాలి బూడిదయ్యాయి. దీంతో యజమాని స్వర్గం శ్రీనివాస్ కన్నీటి పర్యం తమయ్యారు.

8.05 గంటలకు..

విజయ షాపింగ్ మాల్‌లో మంటలు వ్యాప్తి చెందిన రెండు గంటల తర్వాత పక్కనే ఉన్న శ్రీ లక్ష్మి షాపింగ్ మాల్‌కు నిప్పంటుకుంది. అప్పటికే యజమాని కైలాసం, అందులో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు చేరుకుని దుకాణంలోని వస్త్రాలను బయటకు తీసే ప్రయత్నం చేసినా లోపల నుంచి మంటలు ఎగిసి పడడంతో సాధ్యం కాలేదు. అరగంటలో పూర్తిగా కాలిపోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తూ అక్కడే కుప్పకూలి పోయారు.

తప్పిన ముప్పు..

కాంప్లెక్స్‌లో రెండు షాపింగ్ మాల్స్‌తో పాటు 20 దుకాణాలు, పక్కనే ముత్తూట్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, వైన్స్ ఉన్నాయి. షాపింగ్ మాల్స్‌లో మంటలు ఎగిసిపడి ముత్తూట్, బ్యాంకు వరకు వ్యాపించగా ఆందోళన చెందిన పక్కనే ఉన్న రెండు బట్టల దుకాణాలు, కంగన్‌హాల్, పూజాసామగ్రి, డీజే, బ్రాస్ సొసైటీ, కంప్యూటర్, ఫొటో స్టూడియో, ఫైనాన్స్ ఆఫీసులో ఉన్న సామగ్రిని స్థానికుల సహాయంతో బయటకు తీశారు. మంటలు ఇటు వైపు చేరకుండా ఫైర్ అధికారులు షాపింగ్ మాల్ వెనక భాగంలో గోడను కూల్చి లోపలకు వెళ్లి ఆయిల్ బాల్స్ ఇతరత్రా వినియోగించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఇదిలా ఉండగా ఫోరెన్సిక్ నిపుణులు వచ్చి కాలిపోయిన దుకాణాల నుంచి శాంపిళ్లు సేకరించారు.

పేలిన సిలిండర్లు..

మంటలకు షాపింగ్ మాల్‌లో ఉన్న సిలిండర్లు పేలడంతో ఆ శబ్దాలకు అక్కడే ఉన్న ప్రజలు ప్రాణ భయంతో పరుగులు పెట్టారు. భవనాలకు పగుళ్లు రావడంతో పోలీసులు అటువైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. డీసీపీ రాజామహేంద్ర నాయక్ ఆధ్వర్యాన ఏసీపీ పార్థసారథి, సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పర్యవేక్షించారు.

అండగా నిలిచిన స్థానికులు..

అగ్ని ప్రమాదం సందర్భంగా వ్యాపార సంస్థల్లోని సరుకులను ఖాళీ చేసే సమయంలో స్థానికులు అండగా నిలిచారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్ గౌడ్, సీపీఎం నాయకులు బూడిద గోపి, సామాజిక సేవా కర్త జైన రమేశ్, నారోజు రామేశ్వరాచారి తదితరులు ఉదయం నుంచి సాయంత్రం వరకు సేవలందించారు.

అగ్నిమాపక శాఖపై విమర్శల వెల్లువ

ప్రమాద సమాచారం అందిన 40 నిమిషాల తర్వాత జనగామ ఫైర్ ఇంజన్ చేరుకుంది. సిబ్బంది మంటలు ఆర్పే క్రమంలో వాటర్ అయిపోవడంతో బతుకమ్మకుంటకు వెళ్లి నింపుకుని వచ్చే సరికి మంటలు ఎగిసి పడ్డాయి. రెండు షాపింగ్ మాల్స్, రెడీమేడ్ వస్త్ర దుకాణం కాలి బూడిదైన తర్వాత స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, ఆలేరు, మోత్కూరు, భువనగిరి నుంచి ఫైర్ ఇంజన్లు వచ్చి రాత్రి వరకు మంటలను ఆర్పుతూనే ఉన్నాయి. హనుమకొండ, యాదాద్రి, జనగామ డీఎఫ్‌ఓలు జయపాల్ రెడ్డి, మధుసూదన్‌రావు, రెమండ్‌బాబు, ఫైర్ ఆఫీసర్లు మధుకర్, శ్రీరాములు, హమీద్‌సహాయక చర్యలను పర్యవేక్షించారు. సమాచారం అందిన వెంటనే ఫైర్ ఇంజన్లు వస్తే ఇంత నష్టం జరగకపోయేదని అగ్రిమాపక శాఖ తీరును బాధితులు, స్థానికులు విమర్శించారు.

ప్రమాదానికి కారణాలేంటి?

షాపింగ్ మాల్ రాత్రి మూసివేసే సమయంలో విద్యుత్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి సీసీ కెమెరాల కోసం ఇన్వర్టర్‌ను ఆన్ చేసి ఉంచారు. మంటలకు కారణం ఇన్వర్టర్‌తో షార్ట్ సర్క్యూట్ అయిందా.. లేక ఇంకా ఏమైనా జరిగి ఉందా అనే విషయం తెలియాల్సి ఉంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగిందని ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ మధుకర్ తెలిపారు. ఇదిలా ఉండగా.. రోజంతా కాలిపోయిన షాపింగ్‌మాల్ భవనాల పరిస్థితి ఏమిటనే సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది. స్లాబ్, రెయిలింగ్ ప్రమాదకరంగా మారగా.. పెచ్చులూడి పోతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన మొదలైంది. ఇదిలా ఉండగా రాత్రి వరకు అక్కడక్కడా మంటలు ఎగిసి పడుతుండడంతో నాలుగు ఫైర్ ఇంజన్లను అందుబాటులో ఉంచారు.

ఆడుకుంటూ వెళ్లి అనంతలోకాలకు..

● నీటి సంపులో పడి చిన్నారి మృతి
● రత్నగిరి గ్రామంలో ఘటన


అస్మిక మృతదేహం

ఎల్కతుర్తి: ఓ చిన్నారి ఆడుకుంటూ వెళ్లి అనంతలోకాలకు చేరింది. నీటి సంపులో పడి మృతి చెందింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రత్నగిరిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గడిపె సంపత్, స్వర్ణ దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. అస్మిక(4) చిన్న కూతురు. తల్లిదండ్రులు కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తల్లిదండ్రులు కూలీ పనికి వెళ్లగా అస్మిక ఇంటి ఆవరణలో అడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడింది. గమనించిన స్థానికులు అస్మికను సంపు నుంచి బయటకు తీసి ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. దీంతో చిన్నారి మృతదేహం మీద పడి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. అయ్యో బిడ్డా.. అప్పుడే నీకు నూరేళ్ల నిండాయా.. మమ్ములను వదిలి వెళ్లావా తల్లీ అంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో కుటుంబంతోపాటు గ్రామంలో విషాదం అలుముకుంది.

బైక్ పైనుంచి పడి వృద్ధురాలు..

ఏటూరునాగారం: బైక్ పై నుంచి పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని చిన్నబోయినపల్లి–తాడ్వాయి మధ్య ఆదివారం సాయంత్రం జరిగింది. ఎస్సై తాజొద్దీన్ కథనం ప్రకారం.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంథని మండలం పోతారం గ్రామానికి చెందిన గిరుగుల బీమక్క (70) శుభకార్యం నిమిత్తం తన మనవడు ప్రవీణ్‌తో కలిసి బైక్‌పై పోతారం నుంచి ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామానికి వస్తోంది. ఈ క్రమంలో ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలో బైక్ అదుపు తప్పి పడింది. దీంతో బీమక్క రోడ్డుపై పడడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించి పరీక్షించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు.

చదువు కొనసాగించేందుకు అవకాశం

● ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ శంకర్‌రావు


మాట్లాడుతున్న ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ శంకర్‌రావు,పక్కన కౌన్సిలర్లు

విద్యారణ్యపురి: చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ చక్కని అవకాశం కల్పిస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు అన్నారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ మార్కజీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ తరగతుల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెగ్యూలర్‌గా చదువు కొనసాగించలేకపోయినవారికి, మధ్యలో మానేసిన వారికి టెన్త్, ఇంటర్ చదువుకునేందుకు ఓపెన్ స్కూల్ చక్కని అవకాశం కల్పిస్తోందన్నారు. సెలవుదినాలు, ప్రతి ఆదివారం తప్పనిసరిగా తరగతులకు హాజరుకావాలని సూచించారు. రెగ్యూలర్‌గా చదువుకున్నవారితో సమానంగా ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ కూడా ఉపయోగపడుతుందన్నారు. ఓపెన్ స్కూల్ ఇంటర్ తరువాత డిగ్రీ, పీజీ ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చదువుకుంటున్నవారు కూడా ఉనారన్నారు. ఇదిలా ఉండగా ఈవిద్యాసంవత్సరంలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈనెల 30వరకు గడువు ఉందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు అడ్మిషన్లు పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ మార్కజీ హైస్కూల్ కోఆర్డినేటర్ భూక్య బాలు, కౌన్సిలర్లు కె.వాసు వల్సపైడి, కరుణ, ఎడ్ల శ్రీనివాస్, నరసయ్య, కిరణ్‌కుమార్, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

29న ములుగు రోడ్ ఐటీఐలో జాబ్‌మేళా

కాజీపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతకు ప్రైవేట్ సెక్టార్‌లో ఉపాధి అవకాశం కల్పించడానికి ఈ నెల 29న ములుగు రోడ్డులోని ఐటీఐ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి ఎం.మల్లయ్య ఆదివారం తెలిపారు. టీం లీస్ సర్వీసెస్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో వేర్ హౌస్ అసిస్టెంట్స్ ప్యాకర్స్, సేల్స్ అసోసియేట్ అండ్ క్యాషియర్స్ పోస్టులలో 35 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి రూ.12వేలు, 12,900 వేతనం లభిస్తుందన్నారు. 18–25 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు కాజీపేట, హనుమకొండ ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుంది. పదో తరగతి సర్టిఫికెట్‌తో పాటు ఆధార్‌కార్డు ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 78933–94393, 99487–62077 నంబర్లకు కాల్ చేయాలని ఆయన కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం

● ఎంజేపీ గురుకులాల ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్‌సీఓ రాజ్‌కుమార్
● కమలాపూర్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి బాలికల క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడలను ప్రారంభిస్తున్న ఆర్‌సీఓ రాజ్‌కుమార్

కమలాపూర్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్‌సీఓ మోతె రాజ్‌కుమార్ అన్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం ఎంజేపీ గురుకుల పాఠశాలల (అండర్–14, 19 బాలికల) ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి వివిధ క్రీడా పోటీలు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల ఆశయాలను నెరవేర్చాలంటే 24 గంటలు పాఠశాలలో ఉండి చదువుకోవడమే కాదు క్రీడలతో వారికి ఉల్లాసం కలిగించాలని సంస్థ కార్యదర్శి సైదులు సంకల్పించి బాలికలకు చదువుతో పాటు క్రీడల్లోనూ శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నారన్నారు. బాలికలు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో అండర్–19 విభాగంలో 6 కళాశాలలు, అండర్–14 విభాగంలో 18 పాఠశాలలకు చెందిన మొత్తం 840 మంది విద్యార్థినులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినులతో కలిసి కాసేపు వాలీబాల్ ఆడి వారిని ఉత్తేజపరిచారు. అంతకుముందు విద్యార్థినులు ప్రదర్శించిన యోగా, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంజేపీ గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు సౌజన్య, రవీందర్, శోభారాణి, శ్వేత, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానుకోట బీసీ కాలనీలో చోరీ

రెండు తులాల బంగారం, పది తులాల వెండి ఆభరణాలు, రూ.35 వేల నగదు అపహరణ


ఘటనా స్థలిలో వివరాలు సేకరిస్తున్న టౌన్ ఎస్సై విజయ్ కుమార్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రం బీసీ కాలనీలోని ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటనలో రెండు తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలు, రూ.35 వేల నగదును అపహరించుకెళ్లారు. బాధితుల కథనం ప్రకారం.. బీసీ కాలనీలో నివాసం ఉండే కేలోత్ కిషన్, కవిత దంపతులు జిల్లా కేంద్రంలోని కంకర బోర్డు ప్రాంతంలో కవిత శారీ సెంటర్ షాపు నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే శనివారం ఉదయం షాపునకు వెళ్లి రాత్రి సమయంలో ఇంటికి వచ్చారు. తలుపు బెడం, తాళం తొలగించి పక్కకు పడేసి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో భద్రపరిచిన రెండు తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలు, రూ.35 వేల నగదు కనిపించలేదు. చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్సై బి.విజయ్ కుమార్, ఫింగర్ ప్రింట్స్ బృందం ఘటనా స్థలిలో వివరాలు సేకరించారు. కాగా, బీసీ కాలనీలో శనివారం గుర్తుతెలియని ఓ వ్యక్తి బురఖా ధరించి వచ్చి మూగ వ్యక్తిగా నటించి చైన్ స్నాచింగ్‌కు యత్నించిన ఘటనపై స్థానికులు శంతన్, మేనక, ఇతరుల వద్ద టౌన్ ఎస్సై విజయ్ కుమార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. చోరీల నివారణకు, నిందితులను గుర్తించేందుకుగాను కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని టౌన్ సీఐ దేవేందర్ సూచించారు.

'గూడూరు చరిత్ర' నేటి తరానికి ఆదర్శం


పుస్తకావిష్కరణలో కవులు, చరిత్ర పరిశోధకులు, డాక్టర్ రామచంద్ర, తదితరులు

● ప్రముఖ కవి లింగంపల్లి రామచంద్ర

పాలకుర్తి టౌన్: గూడూరు గ్రామ చరిత్రను పుస్తక రూపంలో తెలియజేయడం అభినందనీయమని, నేటి తరానికి ఆదర్శమని ప్రముఖ కవి డాక్టర్ లింగంపల్లి రామచంద్ర అన్నారు. ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరు గ్రామంలో చౌడవరపు విశ్వనాథం స్మారక గ్రంథాలయంలో శ్రీపోతన చైతన్య వేదిక ఆధ్వర్యంలో పాలడుగు రత్నాకర్‌రావు రచించిన 'గూడూరు చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ గూడూరు గ్రామ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు 'గూడూరు చరిత్ర' పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కాకతీయులు, శాతవాహనుల కాలం నుంచి నేటి వరకు గూడూరుకు ఘన చరిత్ర ఉందన్నారు. నిజాం కాలంలోనే తొలిసారి గోడ పత్రిక వెలువడిన గ్రామం గూడూరు అన్నారు. గూడూరులో ఎంతో మంది విద్యావేత్తలు, మేధావులు ఉన్నారని, వారి స్ఫూర్తితో ముందుకు సాగడం అభినందయనీయమన్నారు. మిగతా గ్రామాల చరిత్రలను కూడా పుస్తకం రూపంలో తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పోతన్న చైతన్య వేదిక అధ్యక్షుడు అనుముల ఎల్లయ్య, కవులు, రచయితలు డాక్టర్ శంకర మంచి శ్యాంప్రసాద్, యల్లంపట్ల నాగయ్య, చరిత్ర పరిశోధకులు రెడ్డి రత్నాకర్‌రెడ్డి, రామోజు హరగోపాల్, కేవీజీకే ఆచార్యులు, ఆర్థి పరాంకుశం,ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ తెలంగాణ చాప్టర్ కార్యదర్శి బొబ్బల రమణారెడ్డి, సొసైటీ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, మచర్ల పుల్లయ్య పాల్గొన్నారు.

మరణంలోనూ విడిపోని బంధుత్వం

● నిద్రలోనే వియ్యపురాలి మృతి
● తట్టుకోలేక గుండెపోటుతో వియ్యంకురాలు కన్నుమూత..
● కళ్లెంలో విషాదం


అయ్యమ్మ (ఫైల్)


మంగమ్మ(ఫైల్)

లింగాలఘణపురం : ఆ బంధువులు మరణంలోనూ వీడిపోలేదు. బంధువులైన బండ అయ్యమ్మ (65), చిన్నం మంగమ్మ(55) ఒకే రోజు మృతి చెందారు. దీంతో కుటుంబీకులు, బంధులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆదివారం జరిగిన ఈ ఘటనతో మండలంలోని కళ్లెం గ్రామంలో విషాదం నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. పీఏసీఎస్ మాజీ చైర్మన్ బండ చంద్రమౌళి తల్లి అయ్యమ్మ (65) శనివారం రాత్రి అందరితో కలిసి భోజనం చేసి నిద్రించింది. ఏమైందో ఏమోకానీ తెల్లవారే సరికి నిద్రలోనే చనిపోయింది. ఉదయం కుటుంబ సభ్యులు లేచి చూడగా విగత జీవురాలైంది. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అయ్యమ్మ తమ్ముడు మామిడయ్య భార్య (మంగమ్మ కూతురును అయ్యమ్మ రెండో కుమారుడికి ఇచ్చి వివాహం చేయడంతో)వియ్యంకురాలు చిన్నం మంగమ్మ కూడ కళ్లెంలోనే ఉంటుంది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న తన కొడుకు వద్దకు వెళ్లిన మంగమ్మకు వియ్యపురాలు అయ్యమ్మ చనిపోయినవార్త తెలిసింది. వెంటనే గ్రామానికి వచ్చి ఆమె.. అయ్యమ్మ మృతదేహంపై పడి రోదించింది. నిలబడే స్థితిలేక వెనక్కి పడి స్పృహ కోల్పోయింది. వెంటనే బంధువులు జనగామ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఇరు కుటుంబాల బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వియ్యపురాలు మరణం తట్టుకోలే వియ్యకురాలు మృతి చెందడం, వీరంతా ఒకే కుటుంబానికి చెందిన రక్తసంబంధీకులు కావడంతో బంధువులంతా శోకసముద్రంలో మునిగారు.

రోడ్డు ప్రమాదంలో సీపీఎం కార్యకర్త మృతి


మల్లయ్య(ఫైల్)

దుగ్గొండి: రోడ్డు ప్రమాదంలో సీపీఎం కార్యకర్త మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గిర్నిబావిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చెల్పూరి మల్లయ్య(68) శనివారం రాత్రి తన ఇంటి సమీపంలో వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిని దాటుతున్నాడు. ఈ క్రమంలో నర్సంపేట నుంచి వస్తున్న స్కార్పియో వాహనం ఢీకొనగా మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనం ఆపకుండానే పారిపోయాడు. గమనించిన స్థానికులు మల్లయ్యను 108లో ఎంజీఎంకు తరలించగా ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య సుశీల, కుమారుడు, నలుగురు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా, మృతదేహాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈసంపల్లి బాబు, మండల కార్యదర్శి బోళ్ల సాంబయ్య, నాయకులు చల్ల నర్సింహారెడ్డి, చెల్పూరి మొగిలి, యార కుమారస్వామి, పి. నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింహస్వామి, కొడెం రమేశ్ సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవడంతో పాటు యాక్సిడెంట్ చేసిన స్కార్పియో యజమానిపై, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.